


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 347 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | సోమవారం 17 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :347 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | MON 17 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి



**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఇరగవరం మండలం అయితంపూడి లాకుల సమీపంలో

- మిగతా 2లో



### చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

## రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ

- మిగతా 2లో




- సోమవారం నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి
- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు
- మెగా డీఎస్సీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో చర్చకు వైసీపీ వ్యూహం

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది.




మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

- మిగతా 2లో



### విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'..

## వైసీపీపై ఫైర్

- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన

- మిగతా 2లో

### ఏపీ నుంచి 29 మంది ఉత్తమ ఉపాధ్యాయులను

## ఫిన్లాండ్‌కు పంపిన ప్రభుత్వం



పెన్ పవర్ డెస్క్: ఏపీ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ నుంచి 29 మంది ఉత్తమ

- మిగతా 2లో

## నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహం.. హాజరైన చంద్రబాబు, రేవంత్



హైదరాబాద్: పెన్ పవర్ :నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు, తెలంగాణ సీఎం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## దిమాగీ నక్సల్ వ్యాఖ్యలపై పొలిటికల్ వార్..

### మోదీకి చిదంబరం కౌంటర్, రిజిజు స్ట్రాంగ్ రిప్లై



ప్రధాని మోదీ దిమాగీ నక్సల్ వ్యాఖ్యలపై రాజకీయంగా దుమారం రేగింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం..నేనూ దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నని కౌంటర్ ఇచ్చారు. మావోయిస్టు మనస్తత్వం కలిగినవ్యక్తులు వ్యవస్థలో పాతుకుపోయారని, విధానాలను ప్రభావితం చేస్తూ దేశానికి ముప్పుగా మారానని ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో హెచ్చరించారు. శలో వేదికగా చిదంబరం స్పందిస్తూనేనుదిమాగీ నక్సల్ అయినందుకు : గర్వపడుతున్నానని రాశారు. అయితే చిదంబరం

- మిగతా 2లో




### ప్రభుత్వాల సెన్సార్‌షిప్‌పై

## ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం..

- కంటెంట్ తొలగింపుపై ప్రభుత్వ ఆదేశాలను బహిర్గతం చేయనున్న ఎక్స్
- పారదర్శకత పెంచడంలో భాగంగానే ఈ నిర్ణయమన్న ఎలాన్ మస్క్
- ఏ ప్రభుత్వ ఏజెన్సీ అభ్యర్థించిందో యూజర్లు చూడగలరు
- మస్క్ యాజమాన్యంలో ప్రభుత్వ అభ్యర్థనల అమలు రేటు అధికమని నివేదిక
- రికమండేషన్ అల్గారిథమ్‌పైనా పారదర్శకతకు చర్యలు

- మిగతా 2లో

### అమెరికా సైనికులను పట్టుకున్నా.. చంపేసినా..

## 30 వేల డాలర్ల రివార్డు

### ఇరాన్ ఆర్మీ చీఫ్ సంచలన ప్రకటన..




టెహ్రాన్: ఇరాన్, అమెరికా యుద్ధం ఊహించని మలుపు తిరిగింది. ఇరాన్ సైన్యం సంచలన ప్రకటన చేసింది. అమెరికా సైనికులను పట్టుకున్నా.. చంపేసినా.. 30 వేల డాలర్ల రివార్డు ఇవ్వనున్నట్టు ఇరాన్ ప్రకటించింది. ఒకవేళ ఈ పనిని ఒక మహిళ చేస్తే.. ఆ బహుమతి రెట్టింపు చేస్తామని ఇరాన్ చేసిన ప్రకటన అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఆర్థిక సహాయంలో పాలుపంచుకోవడానికి అనేక అభ్యర్థనలు వచ్చిన క్రమంలో ఈ ప్లాన్ అమలు చేయాలని భావిస్తున్నట్లు ఇరాన్ సైన్యాధిపతి

- మిగతా 2లో

## కాంగ్రెస్ నేతలూ.. సిగ్గుపడండి



### నిప్పులుచెరిగిన హోంమంత్రి అమిత్ షా

పెన్ పవర్ డెస్క్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన అంశంపై వివాదం రాజుకుంది. రాజస్థాన్‌లోని చిత్తౌడ్‌గఢ్ లో

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# విర్రవీగితే అంతే

తూర్పు ఇండోనేసియాలో శనివారం సంభవించిన భారీ భూకంపం ధాటికి మృతుల సంఖ్య 47కు చేరింది. 100 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇళ్లను వదిలి తాత్కాలిక ఆశ్రయాలకు వెళ్లారు. ఆదివారం శిథిలమైన భవనాలు, కొండచరియల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు గాలింపు చేపట్టాయి. ప్రాణాలతో బయటపడినవారి కోసం కూడా గాలిస్తున్నారు.జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగ్గరై రీజెన్సీలో 24 మంది, పొరుగున ఉన్న తూర్పు మంగ్గరైలో 17 మంది మృతి చెందారు. సిక్కా, నగాడా, ఎండే రీజెన్సీల్లోనూ మరణాలు నమోదయ్యాయి. ఫ్లోరెస్ దీవిలోని ఆరు రీజెన్సీల్లో భూకంపం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వాటి కింద గ్రామస్థులు చిక్కుకుని ఉంటారనే అనుమానంతో సహాయక సిబ్బంది గాలిస్తున్నారు.

**తీవ్రత ఎక్కువగా ఉండటంతో...**

అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం.. తూర్పు నుసా తెంగారా ప్రావిన్స్‌లోని ఎండేకు 68 కిలోమీటర్ల దూరంలో, సముద్రతీరానికి సమీపంలో 10 కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రం ఉంది. దీని తీవ్రత 7.7గా నమోదైంది. ఫ్లోరెస్ దీవి మొత్తం ప్రకంపనలకు గురైంది. దీంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పశ్చిమ నుసా తెంగారా, దక్షిణ సులవేసిలోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రకంపనలు కనిపించాయి.భూకంపం వల్ల 900కుపైగా ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో 450 ఇళ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 5,000 మంది తాత్కాలిక శిబిరాలకు తరలివెళ్లారు. బలమైన ప్రకంపనలు మళ్లీ వస్తాయనే భయంతో వేలాది మంది రాత్రంతా బయటే గడిపారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, చర్చిలు సహా కనీసం 167 ప్రభుత్వ, ప్రజా భవనాలు దెబ్బతిన్నాయి.బాధితులకు బియ్యం, సిద్ధంగా తినే ఆహారం, తాగునీరు, దుప్పట్లు, మందులను సహాయక సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్, సమాచార వ్యవస్థలను పునరుద్ధరించడం, కొండచరియల వల్ల రాకపోకలు నిలిచిపోయిన మారుమూల గ్రామాలకు సాయం చేర్చడం ప్రధాన సవాళ్లుగా మారాయి.

**కొండచరియలతో రహదారుల దిగ్బంధం...**

ఇండోనేసియాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొమోడో నేషనల్ పార్క్‌కు ప్రధాన ద్వారంగా ఉన్న లబువాన్ బాజోను కూడా భూకంపం తాకింది. దాదాపు 700 కిలోమీటర్ల పొడవైన ట్రాన్స్-ఫ్లోరెస్ హైవేపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారి పర్వత ప్రాంతంలోని పలు పట్టణాలు, గ్రామాలను కలుపుతుంది.దెబ్బతిన్న ఇళ్లలోకి వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీంతో చాలామంది ఆరుబయటే నిద్రిస్తున్నారు.లబువాన్ బాజోకు చెందిన రైతు అనస్తాసియా ఇమాడ్ తన దెబ్బతిన్న ఇంటి పక్కన ఏర్పాటు చేసిన ఆకుపచ్చ టెంట్‌లో మాట్లాడుతూ.. "భూమి వణికిన తీరు భయానకంగా ఉంది. ప్రకంపనలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే మా ఇల్లు దాదాపు కూలిపోయే పరిస్థితి వచ్చింది. నిద్రిస్తున్న సమయంలో భూప్రకంపనలు మళ్లీ వస్తే ఇల్లు మా మీద కూలిపోతుందేమోనని భయపడ్డాం" అని చెప్పారు.భూకంపం తర్వాత రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో ఆదివారం సహాయక బృందాలు మళ్లీ గాలింపు ప్రారంభించాయి. ముఖ్యంగా మంగ్గరై, తూర్పు మంగ్గరై, నగెకియో రీజెన్సీల్లో గాలింపు ముమ్మరం చేశారు."చాలావరకు కొండచరియలను తొలగించి, రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు రహదారులను తెరిచాం. అయితే సమాచార వ్యవస్థలో అంతరాయాలు, విద్యుత్ కోతలు గాలింపు చర్యలకు ఇబ్బందిగా మారాయి" అని సిక్కా రీజెన్సీ రాజధాని మౌమెరెలోని గాలింపు, సహాయక కార్యాలయ అధిపతి ఫతుర్ రహ్మాన్ తెలిపారు.కూలిపోయిన ఇళ్లు, ఇతర భవనాల శిథిలాల్లో బాధితుల కోసం గాలింపు కొనసాగుతోందని ఆయన చెప్పారు.

**'రింగ్ ఆఫ్ ఫైర్'లో ఇండోనేసియా...**

17,000కుపైగా దీవులతో కూడిన ఇండోనేసియాలో తరచూ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనలు సంభవిస్తుంటాయి. పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్'గా పిలిచే భూకంప, అగ్నిపర్వత ప్రాంతంలో ఆ దేశం ఉండటమే ఇందుకు కారణం.ఫ్లోరెస్ దీవి గతంలోనూ భారీ విపత్తులను ఎదుర్కొంది. 1992లో సంభవించిన భారీ భూకంపం, సునామీలో ఈ దీవిలో సుమారు 2,500 మంది ప్రాణాలు కోల్పోయారు. 2018లో సులవేసిలో 7.5 తీవ్రతతో వచ్చిన భూకంపం సునామీకి దారితీసింది. ఈ ఘటనలో 4,400 మందికిపైగా మృతి చెందారు. 2004లో సుమత్రా తీరానికి సమీపంలో 9.1 తీవ్రతతో వచ్చిన భూకంపం భారీ సునామీని సృష్టించింది. 12 దేశాల్లో సుమారు 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.

## అమెరికా సైనికులను పట్టుకున్నా.. చంపేసినా.. 30 వేల డాలర్ల రివార్డు

- మొదటి పేజీ తరువాయి

అమీర్ హతామి చెప్పినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఎ వెల్లడించింది. ఇజ్రాయెల్తో కలిసి అమెరికా ఇరాన్‌పై దాడి చేయడంతో ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం మొదలైంది. దాదాపు 40 రోజుల యుద్ధం తర్వాత ఏప్రిల్‌లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఆ తర్వాత శాంతి చర్చల కోసం జూన్‌లో ముసాయిదా కూడా రూపొందించారు. కానీ అది విఫలమైంది. అప్పటి నుంచి ఇరాన్, అమెరికా అడపాదడపా కాల్పులు జరుపుకుంటున్నాయి. అయితే ఇటీవల ఈ యుద్ధం దక్షిణ ఇరాన్, హొటరీర్ముజ్ జలసంధి చుట్టూ కేంద్రీకృతమై సాగుతుండటం గమనార్హం.

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. మండలిలో హోరాహోరీ!

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**

అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ-2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు.

దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

## ప్రభుత్వాల సెన్సార్‌షిప్‌పై ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం..

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కంటెంట్ తొలగింపు లేదా పరిమితులపై ప్రభుత్వాల నుంచి వచ్చే అభ్యర్థనలను యూజర్లకు మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తామని ప్రకటించారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ జోక్యం, కంటెంట్ నియంత్రణ వంటి అంశాల్లో పారదర్శకతను పెంచే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు.ఈ కొత్త మార్పుల గురించి ఎక్స్‌లో పోస్ట్ చేసిన మస్క్, "ప్రభుత్వాలు కోరిన ఏ సెన్సార్‌షిప్ అయినా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది" అని తెలిపారు. దీని ప్రకారం, ఏ ప్రభుత్వ ఏజెన్సీ పోస్టులను తొలగించాలని కోరింది, ఏ ఖాతాలపై పరిమితులు విధించాలని అడిగింది వంటి వివరాలను యూజర్లు నేరుగా చూడగలుగుతారు. వీలైతే, ఆ అభ్యర్థనల వెనుక ఉన్న చట్టపరమైన కారణాలు లేదా సమర్థనలను కూడా వెల్లడించనున్నట్లు ఎక్స్ తెలిపింది. ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి ఆన్‌లైన్ కంటెంట్‌ను ఎలా నియంత్రిస్తున్నారు, ర్యాంక్ ఇస్తున్నారు అనే విషయాల్లో యూజర్లకు పూర్తి పారదర్శకత ఉండాలని మస్క్ బలంగా వాదిస్తున్నారు. ఈ తాజా నిర్ణయం కూడా ఆయన విస్తృత లక్ష్యాల్లో భాగమే. ఇదిలా ఉండగా, క్రిప్టో బ్రీఫింగ్ నివేదిక ప్రకారం, మస్క్ యాజమాన్యంలో ఎక్స్.. ప్రభుత్వాల నుంచి వచ్చిన టేక్‌డౌన్ అభ్యర్థనలను 83 శాతం నుంచి 98.8 శాతం వరకు అమలు చేసింది. ఇది పాత యాజమాన్యం కంటే అధికం కావడం గమనార్హం. కేవలం ప్రభుత్వ అభ్యర్థనలకే పరిమితం కాకుండా, తమ రికమండేషన్ అల్గారిథమ్‌లను కూడా ఎక్స్ పారదర్శకంగా ఉంచుతోంది. టెక్నాలజీలోని కొన్ని భాగాలను ఓపెన్-సోర్స్ చేయడం ద్వారా, ఏ పోస్టులను ప్రమోట్ చేస్తున్నారు, వేటిని తగ్గించి చూపుతున్నారు అనే అంశాలపై పరిశోధకులకు, యూజర్లకు స్పష్టత ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తం మీద, కంటెంట్ నియంత్రణలో యూజర్లకు మరింత స్పష్టమైన సమాచారం అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్

తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు.

ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం

దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

- మొదటి పేజీ తరువాయి

ఆదివారం ఉదయం అదుపు తప్పిన కారు నరసాపురం పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రానికి నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి కోసం గాలిస్తున్నారు.ఈ ప్రమాదంలో కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మీభానువికాస్ (18), నాగిరెడ్డి దుష్యంత్ సాయి(18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురంలోని చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలోని చింతపర్రుకి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) గల్లంతయ్యారు. ఆచంట మండలం వల్లూరుకి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయటపడ్డాడు. వీరంతా పెరవలిలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పెరవలి నుంచి నరసాపురం బయలుదేరగా మార్గంమధ్యలోని ఓగిడిలో స్నేహితుడిని కలిశారు. అక్కడి నుంచి అయితంపూడి మీదుగా వెళ్తుండగా నరసాపురం వైపు తిరిగే క్రమంలో లాకుల వద్ద కారు అదుపు తప్పి ఎదుట పంట కాలువలోకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో వర్షం పడుతుండగా ప్రయాణ సమయంలో ఎదురుగా ఉన్న కాలువను గమనించకపోవడంతో కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రవాహ వేగానికి కారు సుమారు 100 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. సంతోష్ చెట్టు కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు కాపాడారు. హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా

అయితంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుష్యంత్ సాయి, మార్టేరు సమీపంలో సాయిసూర్యతేజ మృతదేహాలు దొరికాయి. రాజారాం చరణ్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. చరణ్ మినహా మిగిలిన వారంతా నరసాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అందరూ 20ఏళ్లలోపు యువకులే కావడంతో ఇరు జిల్లాల్లోనూ విషాదచాయలు అలుముకున్నాయి.

## దిమాగీ నక్సల్ వ్యాఖ్యలపై పొలిటికల్ వార్..

- మొదటి పేజీ తరువాయి

పోస్టు కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు తీవ్రంగా స్పందించారు. ప్రధాని మోదీ ప్రతిపక్ష నేతలను దిమాగీ నక్సల్స్ అని పిలవలేదని, కేవలం నిర్దిష్ట వర్గాన్ని ఉద్దేశించిన మాత్రమే అలా అన్నారని కిరణ్ రిజుజు బదులిచ్చారు. మాజీ హోంమంత్రి ఇలా మాట్లాడటం దురదృష్టకరం, దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించేవిధంగా ఉన్నాయని ఎ లో పోస్ట్ షేర్ చేశారు కిరణ్ రిజుజు. మావోయిస్టులకు సపోర్టు చేస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారు, వేర్పాటు వాదులతో నిలబడి ఆర్టికల్ 370కి మద్దతు ఇచ్చేవారు,ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేసేందుకు కుట్ర చేస్తున్నవారిని ఉద్దేశించి ప్రధాని ఆ వ్యాఖ్యలు చేశారని కిరణ్ రిజుజు బదిలిచ్చారు.

## కాంగ్రెస్ నేతలూ.. సిగ్గుపడండి: నిప్పులుచెరిగిన హోంమంత్రి అమిత్ షా

- మొదటి పేజీ తరువాయి

జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ టార్గెట్‌గా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ గీతం వందేమాతరం ఆలపిస్తుండగా, మధ్యలోనే ఆపేయాలని సోనియా గాంధీ పార్టీ అధ్యక్షుడికి సూచించారని అమిత్ షా ఆరోపించారు. కేవలం ఓటు బ్యాంక్ రాజకీయం కోసమే జాతీయ గేయాన్ని అవమానించిందని.. అందుకు కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలని కామెంట్ చేశారు. ఈ ఘటనపై సోనియా గాంధీ 140 కోట్ల భారతీయులకు, అలాగే వందేమాతరం రచయిత బంకిం చంద్ర ఛటర్జీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని అమిత్ షా డిమాండ్ చేశారు.

అయితే, 'వందేమాతరం' గేయాలాపనపై అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. వేడుకల్లో వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించామని క్లారిటీ ఇచ్చింది. ఈ విషయంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ మాట్లాడుతూ.. సోనియా గాంధీ పాటను ఆపమని చెప్పలేదని, కొంతసేపటి నుంచి నిలబడి ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే కోసం కుర్చీ వేయమని మాత్రమే కార్యకర్తలకు సూచించారని స్పష్టం చేశారు. బీజేపీ కావాలనే ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు.ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' (H.A.N.U.M.A.N ... Healing and Nurturing Units for Monitoring, Aid and Nursing of Wildlife ) బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

## ఏపీ నుంచి 29 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్లాండ్‌కు పంపిన ప్రభుత్వం

- మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులను ఫిన్లాండ్‌కు పంపింది. ఏపీలో విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా.. తరగతి గది అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి అనువుగా మార్చుకోగలిగే అంతర్జాతీయ పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యా పద్ధతులు, వినూత్న బోధనా విధానాలను నేరుగా చూసి.. ప్రత్యక్ష అనుభవాన్ని పొందేందుకు, ప్రభుత్వ పాఠశాలల నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన 29 మంది విద్యార్థులు ఆగస్టు 15న ఫిన్లాండ్‌కు బయల్దేరి వెళ్లారు.ఈ కార్యక్రమాన్ని ఫిన్లాండ్‌లోని టర్కు విశ్వవిద్యాలయ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఆగస్టు 17 నుంచి 26 వరకు జరిగే ఎనిమిది రోజుల ఆన్‌సైట్ కార్యక్రమంలో భాగంగా.. ఉపాధ్యాయులు టర్కు, రౌమాను సందర్శించి, తరగతి గది పరిశీలనలు, విద్యా క్షేత్ర సందర్శనలు, బాల్య విద్యా కేంద్రాలు, ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలలలోని విద్యావేత్తలతో సంభాషణలలో పాల్గొంటారు. ఉపాధ్యాయులు మన సమాజానికి పునాదులని, మన పిల్లల భవిష్యత్తుకు రూపకర్తలని.. మన విద్యార్థులను మాత్రమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును కూడా తీర్చిదిద్దే శక్తి వారికి ఉందని నారా లోకేష్ చెప్పారు.ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాల్లో అనుభవం కల్పించి వారిని శక్తివంతం చేయడం మన బాధ్యత అని మంత్రి నారా లోకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతర్జాతీయ అభ్యాస అవకాశం మన ఉత్తమ ఉపాధ్యాయులు ఫిన్లాండ్ నుంచి కొత్త ఆలోచనలు, ఉత్తమ పద్ధతులను తిరిగి తీసుకువచ్చి వాటిని మన పాఠశాలలకు అనుగుణంగా మార్చుకోవడానికి సహాయపడుతుందని మంత్రి నారా లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహదేవపురంలో రాష్ట్ర స్థాయి

# ఎడ్ల పోటీలు ప్రారంభం

-పోటీలను ప్రారంభించిన టిడిపి నాయకుడు దివి రవీంద్రనాథ్

-విజేతలకు భారీ నగదు బహుమతులు ప్రకటించిన దివి రవీంద్రనాథ్

-సీనియర్ విభాగం ప్రథమ బహుమతి రూ.80 వేలు.. జూనియర్ విభాగం విజేతకు రూ.30 వేలు





**కందుకూరు**
**పెన్ పవర్, ఆగస్టు 16**



మండలంలోని మహదేవపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అంకమ్మతల్లి అమ్మవారి తిరుణాళ్ల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగుదేశం పార్టీ నాయకుడు దివి రవీంద్రనాథ్ ప్రారంభించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎడ్ల పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా దివి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పశుసంపదను ప్రోత్సహించడంతో పాటు రైతులు, పశుపోషకుల్లో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎడ్ల జతలకు, వాటి యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు పోటీల్లో విజేతలకు తన వంతు ప్రోత్సాహాన్ని అందించేందుకు దివి రవీంద్రనాథ్ ముందుకు వచ్చారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించే ఎడ్ల జతకు రూ.80 వేల నగదు, జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించే ఎడ్ల జతకు రూ.30 వేల నగదు బహుమతిగా అందజేస్తానని నిర్వాహకులకు ప్రకటించారు. దీంతో పోటీల్లో పాల్గొంటున్న ఎడ్ల యజమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. అంకమ్మతల్లి తిరుణాళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పోటీలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఎడ్ల జతల పరుగు, వాటి వేగం, శిక్షణ, సామర్థ్యాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీలు ఆసక్తికరంగా సాగుతుండటంతో ప్రేక్షకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ పోటీదారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దివి రవీంద్రనాథ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామీణ క్రీడలు, సంప్రదాయ కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న ప్రోత్సాహాన్ని కమిటీ సభ్యులు ప్రశంసించారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు గుళ్ళా సుధాకర్, గుళ్ళా శ్రీనివాసరావు, గుళ్ళా రమణయ్య, గుళ్ళా నరసింహారావు, దామా పున్నయ్య, ఓరుగంటి శివ రామయ్య, బండి వెంకటేశ్వర్లు, దామా కొండలరావు, ఓరుగంటి రమ ణయ్య, చిట్టాబత్తిన హరికృష్ణ, తలపనేని నరశింగరావు తదితరులు పాల్గొన్నారు.

**బహుమతులు పొందిన విజేతలు వీరే....:** సీనియర్ విభాగంలో తెలంగాణ నాగర్ కర్నూల్ కు చెందిన రాయవరం రామచంద్రారెడ్డి ఎడ్లజతకు మొదటి బహుమతి, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోటి రామకృష్ణ ఆర్కే బుల్స్ ఎడ్ల జతకు రెండో బహుమతి, తెలంగాణ నాగర్ కర్నూల్ కు చెందిన వల్లా తన్నీరు బాబుకు చెందిన ఏఎస్ఆర్ బుల్స్ ఎడ్ల జతకు మూడో బహుమతి అందుకున్నారు. జూనియర్ విభాగంలో గుంటూరు జిల్లా కాకాణికి చెందిన ఆళ్ల రాజేష్ యాదవ్ కుమొదటి బహుమతి, సంతమాగులూరుకు చెందిన విశ్వేశ్వరెడ్డికి చెందిన ఎడ్ల జతకు రెండో బహుమతి, పొన్నలూరు మండలం రావులకొల్లుకు చెందిన పాలడుగు వెంకటేశ్వర్లు- శ్రీదేవిలకు చెందిన ఎడ్ల జత మూడో బహుమతి సాధించాయి.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# వైఎస్సార్ సీపీకి షాక్ మీద షాక్

టీడీపీలోకి భారీగా చేరికలు -50 కుటుంబాలకు పైగా టీడీపీలో చేరిక

టిడిపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం,సుపరిపాలన, గిద్దలూరు లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తుండటానికి ఆకర్షితులమై





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ఆదివారం పెద్ద సందడి వాతావరణం నెలకొంది . ఆప్రాంతమంతా పసుపు మాయమై ఉంది , తీరాచూస్తే పెససేతున వైకాపా శ్రేణులు తరలి వచ్చి టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. అర్థవీడు మండలంలోని కొత్తూరు , కాకర్ల, మాగుటూరు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు , కార్యకర్తలు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పార్టీకి చెందిన పలువురు నాయకులు , కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమశీ మద్దెర్ల రాజగోపాల్ గోపాల్, పెద్ద పోలయ్య, కోటపాటి వెంకటేశ్వర్ల రెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్ అల్లూరయ్య, దివాకర్, మాజీ ఎంపిటిసి ఎర్రగుంట్ల రాజు, బత్తిన ప్రసాద్, పేర్నిపాటి రామ సుబ్బయ్య, కర్ణం కాసయ్య, కోలా శేఖర్ ఆధ్వర్యంలో దారా దానియేలు, రాజారావు, నాగరాజు, పల్లెబోయిన రామయ్య,రామాంజనేయులు,ఆంజనేయులు, ఆవుల రాజు, పెద్ద కరయ్య, కుమారి , రజిని, లక్ష్మీ, రేణుక, తుత్తురి లక్ష్మీ, రాజు, మద్దెర్ల రాజయ్య,చిన్న అల్లూరయ్య, గుమ్మా పెద్దిరాజు, ఎరువ కోటిరెడ్డి, రమణా రెడ్డి, పోలేబోయిన రాజయ్య, పోలురవి, ఉడుముల రాజు, ఒబయ్య, దానియేలు, ఉడుముల రాజు దాసు, కోలా రవి, క్రిష్ణయ్య, శ్రీను, రమణ, వెంకటేశ్వర్లు, అడపాల వెంకటరావు,నల్లబోతుల వెంకటేశ్వర్లు, శేషయ్య,కేశవరావు, ఎస్క్ మస్తాన్, అలవలపాటి లక్ష్మయ్య, దేశవత్ బాల కాశీనాయక్, కృష్ణా నాయక్,గోనావత్ శుక్లా నాయక్, తదితరులు వైసీపీ పార్టీకి చెందిన పలువురు నేతలు కలిపి సుమారుగా 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు వారందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సిద్ధాంతాలు, కూటమి ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీలో చేరడం పట్ల ఎమ్మెల్యే అశోక్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు, మండల ప్రముఖులు, నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బధిర విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తాం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు

## డీజేఆర్ ట్రస్ట్ దాతృత్వం బదిరుల ఆశ్రమ పాఠశాలకు 60 ఇనుప మంచాలు బహుకరణ





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

బధిర విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చే విధంగా డీజేఆర్ ట్రస్ట్ ముందుకు వచ్చినట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. డీజేఆర్ ట్రస్ట్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకుంది. ఒంగోలులోని ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాలకు రూ.4 లక్షలు విలువైన 60 ఇనుప మంచాలను అందించింది. అక్కడ చదువుకునే బధిర విద్యార్థులు నేలపై పడుకుంటున్న విషయం తెలుసుకున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు సతీమణి, డీజేఆర్ ట్రస్టీ నాగసత్యలత యుద్ధ ప్రాతిపదికన ఇనుప మంచాలు సిద్ధం చేయించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, ట్రస్ట్ డైరెక్టర్లు అనిషాలక్ష్మీ, తనూజాలక్ష్మీ చేతుల మీదుగా 60 ఇనుప మంచాలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ అద్దె భవనంలో నడుస్తున్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను నాలుగున్నర కోట్ల రూపాయలతో భాగ్యనగర్ లో మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులకు అన్ని వస్తువులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీజేఆర్ ట్రస్టీ దామచర్ల నాగసత్యలత మాట్లాడుతూ తమ పాప పుట్టినరోజు ఇక్కడ జరుపుకోవాలని వచ్చినప్పుడు విద్యార్థులు కింద పడుకుంటున్న విషయాన్ని తెలుసుకొని వెంటనే వారికి ఇనుప మంచాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇక్కడ చదువుకునే పిల్లల అనుబంధాన్ని చూస్తే ఎంతో సంతోషం కలిగించిందని, మునుముందు డీజేఆర్ ట్రస్టు తరపున మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు

అడిగేవాళ్లు లేరని అటవీ భూములలో మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యం

సంఘటన స్థలానికి వెళ్లిన అధికారుల నిర్బంధం

అధికారుల స్వాధీనం చేసుకున్న ప్రోక్లైన్‌ను బలవంతంగా ఎత్తుకెళ్లిన అరవింద బాబు

ఫిర్యాదు చేయడం కోసం పోలీస్ స్టేషన్ మెట్ల ఎక్కిన బీట్ ఆఫీసర్లు

**సంతమాగులూరు, (బల్లికురవ)**
**పెన్ పవర్, ఆగస్టు 16**



బల్లికురవ మండలం ఉప్పుమాగు లూరు గ్రామ పంచాయతీ పరిధిలో 9 ఎకరాల్లో అటవీ శాఖకు చెందిన భూములలో కొండ ప్రాంతం ఉంది. అయితే కొండ చుట్టూ ఉన్న గ్రావెల్ను అక్రమంగా తవ్వుకుంటూ, కాసుల దండుకోటం పాలకులు ఎవరైనా, పరిపాటిగా మారింది. శనివారం రాత్రి అటవీ భూములలో అక్రమ గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయంటూ సమాచారం రావడంతో కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు. సమీపంలోనే గ్రావెల్ తవ్వకానికి వినియోగిస్తున్న ప్రోక్లైన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ట్రాక్టర్ ను కూడా అదుపులోకి తీసుకున్నారు. గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న అరవింద బాబు అధికారుల రాక సమాచారం తెలియటంతో అధికారుల వద్దకు వచ్చాడు. అధికారుల విధులకు ఆటకం కలిగించాడు.మా ఊరు, మా కొండ, మా ఇష్టం వచ్చినట్లు తవ్వుకుంటాం. మీరెవరు ఆపటానికి అంటూ అధికారులపై దాష్టీకాన్ని ప్రదర్శించాడు. అధికారుల అదుపులో ఉన్న ప్రోక్లైన్ యంత్రాన్ని విడిపించుకు పోయారు. రాత్రి సమయం కావటం, అధికారులపై తమ దౌర్జన్యాన్ని ప్రదర్శించడంతో, వకింత వెనక్కు తగ్గిన, ఉత్తమ అవార్డు గ్రహీత రమేష్ బాబు జిల్లా ఫారెస్ట్ అధికారి సౌజన్యకు సమాచారం అందించారు. అనంతరం బల్లికురవ పోలీస్ స్టేషన్లో సంఘటన వివరాలు, తమపై అరవిందబాబు ఆధ్వర్యంలో ఏ విధంగా దౌర్జన్యం చేసింది ఫిర్యాదు చేశారు.



# “ప్రజా బంధు” సర్దార్ గౌతు లచ్చన్న

## - జిల్లా కలెక్టర్ రాజాబాబు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

స్వాతంత్ర్య పోరాటంలోనూ, ప్రజా సేవలోనూ తనదైన ముద్ర వేసిన గొప్ప వ్యక్తి ‘ సర్దార్ ‘ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు కొనియాడారు. లచ్చన్న 118వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రకాశం భవనంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాం జలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ అణగారిన ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం తన జీవిత కాలమంతా లచ్చన్న శ్రమించా రని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. జమీందారీ విధానాన్ని రద్దు చేయాలనే నినాదంతో 1937 లో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు రైతులతో పాదయాత్ర చేయటం ఆయా వర్గాల పట్ల లచ్చన్నకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా లచ్చన్నను గౌరవిస్తూ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లచ్చన్న పోరాటపటిమను, సేవా జీవితాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ అన్నారు. ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలిచిన లచ్చన్న జీవితాన్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, గౌడ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మేకపోతుల రాఘవయ్య, అధ్యక్షులు బలగాని ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి అనిల్, జిల్లా కోశాధికారి పాగోలు చింతయ్య, గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రసాద గౌడ్, కొత్తపట్నం మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖలో ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ గా అవార్డు అందుకున్న రంగనాయకులు

**కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులలో చేరి పనిచేస్తున్న రంగనాయకులు.**



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 16**

కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న రంగనాయకులు ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికై మార్కాపురంజిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా ఉత్తమ సేవా అందుకోవడం పట్ల పలువురు రంగనాయకులును అభినందించారు. రంగనాయకులు గత రెండేళ్ల క్రితం రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పోస్ట్ పొంది కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా చేరి విధులు నిర్వహిస్తున్నారు. కాగా రంగనాయకులు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్గా రెవెన్యూ శాఖకు అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ రంగనాయకులను ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ గా ఎంపిక చేశారు. ఆ మేరకు శనివారం మార్కాపురంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత రంగనాయకులుకు ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ అవార్డును అందించి అభినందించారు. రంగనాయకులకు ఉత్తమ జూనియర్ అసిస్టెంట్ అవార్డు లభించడం పట్ల తాసిల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, జూనియర్ అసిస్టెంట్ పెద్ద దేవనాయక్, మండల సర్వేయర్ జమాల్, వీఆర్వోలు పాండు, హనీషా, రమణారావు,పీవీ రమణ, ఇండ్ల నారాయణ, రాజేశ్వరి, సిద్దయ్య, వెంకటేశ్వర్లు, రంగనాయకులు,నాయబ్ రసూల్, రంగనాథ్,అంకయ్య, వీఆర్ఏలు రాజేశ్వరి, హబీబా పోలమ్మ మరియ జ్యోతి తదితరులు అభినందించారు.

# నేడు కొమరోలు పట్టణంలో ని 7 వీధులకు, తాతిరెడ్డి పల్లె ఫీడర్ లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 16**



కొమరోలు పట్టణంలోని 7 వీధులకు, తాతిరెడ్డి పల్లె ఫీడర్ లోని గ్రామాలకు ఈ నెల 17వ తేదీ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్డిఎస్ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటు లో భాగంగా ఈనెల 17వ తేదీ సోమవారం కొమరోలు పట్టణంతోపాటు,,తాతిరెడ్డి పల్లె ఫీడర్ లో కొత్త లైన్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆకారణంగా కొమరోలు పట్టణంలోని పురుషోత్తమునిపల్లెకు వెళ్లే రోడ్డులోని వీధులకు, ఇండేన్ గ్యాస్ కార్యాలయం గల మెయిన్ రోడ్డు వీధులకు, ఆరె మరాఠీ కాలనీ, శివాజీ నగర్, ఇస్లాంపేట, స్టేట్ బ్యాంక్ వీధి, బ్రాహ్మణ బజార్, సినిమా హాల్ కు వెళ్లే రోడ్డు వీధులతొ పాటు తాతిరెడ్డి పల్లె ఫీడర్ లోని తాతిరెడ్డి పల్లె, పురుషోత్తమునిపల్లి, సరివి రెడ్డి పల్లె, కే బొంతపల్లి గ్రామాలకు ఈనెల 17వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి

**లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేస్తామన్న నేతలు**



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 16:**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఆదివారం కొరిశపాడు మండలం, మేదరమెట్లలో ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా జై గౌడ్ ఉద్యమ అధ్యక్షులు మోరపాకుల లక్ష్మణ స్వామి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆయన స్ఫూర్తితో సమాజ అభివృద్ధిలో పాలుపంచుకుంటామని తెలిపారు. గౌతు లచ్చన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వానికి వారు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఉదయగిరి వెంకట్రావు గౌడ్, నేతలు రౌతు రామాంజనేయులు గౌడ్, ఉదయగిరి శంకర్, యార్లగడ్డ సుబ్బారావు గౌడ్, తాత ఏడుకొండలు గౌడ్, పలువురు గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకులు జగదీష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం

## నాడు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి నేడు ప్రజా సమస్యల పరిష్కారం

## మంత్రి గొట్టిపాటి చొరవతో ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధి

## కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు

**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 16**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు మక్కెన జగదీష్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మక్కెన జగదీష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాయని, ప్రతి గ్రామంలో ఇబ్బందిగా మారిన రహదారులు నూతనంగా నిర్మించడం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పనిచేస్తుందని, ప్రజా సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందని ఆయన తెలిపారు. కొద్ది రోజుల క్రితం జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని క్రీడా ప్రాంగణం సమస్య ఉండగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో బయట నుంచి ఎర్రమట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో తీసుకువచ్చి క్రీడా ప్రాంగణం అంతా చదును చేయించి విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కారం చేయమని, అంతేకాకుండా పాఠశాలలోని మౌలిక సదుపాయాల లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తాను కూడా ఈ పాఠశాల లోనే చదువకున్నానని, ఒక పూర్వ విద్యార్థిగానే కాకుండా ఒక సామాజిక



పౌరుడిగా ఈ అవకాశం నాకు దక్కడం ఎంతో గర్వంగా ఉందని ఆయన తెలిపారు. అదేవిదంగా గ్రామంలో నూతనంగా విద్యుత్ స్తంభాలు వేయడానికి అధికార యంత్రాంగం రంగం సిద్దం చేశారని, అధిక లోడు వలన పలు చోట్ల ట్రాన్స్ఫార్మర్ లు సమస్య రావడం ఆ సమస్యకు విద్యుత్ శాఖ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి వెంటనే ఒంగోలు విద్యుత్ ఆఫీస్ నుండి కొత్త ట్రాన్స్ఫార్మర్లు తెప్పించి సమస్యకు పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే తన



దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కార మార్గానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు గోరంట్ల యల్లమందరావు, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాజీ చైర్మన్ కోయ శివకోటి, ఏలూరి ప్రసాద్, మోతుకూరి భగత్, నాగబోతు శ్రీనివాసరావు, మక్కెన శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "ఆత్మీయం"గా నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాల ప్రదానోత్సవం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 16**

జాతీయకవి,ప్రకాశం జిల్లాకు సాహిత్యపరిమళాన్ని అద్ది,ఎందరో వ్యక్తులను సాహితీవేత్తలుగ తీర్చిదిద్దిన డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేర ప్రతి సంవత్సరం నాగభైరవ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో జరిగే పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం రంగభవన్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దారా సాంబయ్య నాగభైరవ విశిష్ట వ్యక్తిత్వాన్ని కొనియాడి, వారితో తన అనుబంధాన్ని చాటుకున్నారు. డాక్టర్ నూనె అంకమ్మరావు నాగభైరవ కవితా జీవిత విశేషాలను,ఆధునిక కవులపై వారి ప్రభావాన్ని వివరించారు. నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) నాగభైరవ ప్రకాశం జిల్లాకు చేసిన సాహితీ సేవను ప్రస్తుతించారు. ఈదర హరిబాబు నాగభైరవతో తన సంబంధాన్ని పంచుకున్నారు. వీరవల్లి సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు, కుర్రా ప్రసాద్ బాబు నాగభైరవ నిర్వహించిన పదవుల గురించి, ఎన్టీఆర్ తో అనుబంధం గురించి , సినిమా,టీవీ రంగాలకు ఆయన అందించిన సేవల గురించి చెప్పారు. నాగభైరవ కుటుంబసభ్యులు గొల్లపూడి ప్రకాశరావుకు ఆత్మీయ పురస్కారం అందజేశారు. సాహిత్య పురస్కారవిజేతలైన పేట యుగంధర్, మాచిరాజు కామేశ్వర రావులకు గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ నగదు బహుమతిని, సాహిత్యపీఠం సత్కరాన్ని అందజేశారు. చింతల శ్రీనివాసగుప్తకు చుండి సుజాత కుటుంబం నగదు బహుమతితోపాటు సత్కారాన్ని అందించారు. నుసుము నాగభూషణానికి డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు నగదును ఇవ్వగా, సాహిత్యపీఠం సత్కరించింది. పురస్కార గ్రహీతలు తనకు జరిగిన సత్కారాలకు సముచితరీతిన స్పందించారు. కళారత్న డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ బీరం సుందరరావు, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, అన్నమనేని ప్రసాద్ పురస్కార గ్రహీతల సాహితీసేవను కొనియాడారు. సింహాద్రి జ్యోతిర్మయి సభాహ్వానం పలికిన ఈ సభలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, కవులు, రచయితలు పాల్గొన్నారు. సభ ఆద్యంతం సాహితీ పరిమళాలను వెదజల్లుతూ అందరినీ అలరించింది.

# పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి సిఎం చంద్రబాబు పెద్దపీట

**మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం**

**కాకుటూరువారిపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ని ప్రారంభించిన మంత్రి**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కాకుటూరు వారిపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని అన్నారు. వైసీపీ హయాంలో పేద ప్రజల ఆరోగ్యానికి గాలికొదిలి వైద్య శాఖను నిర్లక్ష్యం చేశారన్నారు. నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం మందులు కూడా దొరికే పరిస్థితి లేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పి 4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే.. వైసీపీ ఓర్వలేక రాష్ట్రంలో శవ, కుల రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వైసీపీ ఓ విషవృక్షం ప్రజలు దాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలని లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# వర్షాలు కురవాలని వి బైలు గ్రామస్తులు ప్రత్యేక పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 16**

వర్షాలు లేకపోవడంతో సాగు పనులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని వి. బైలు గ్రామస్తులు ఆదివారం గ్రామానికి సమీపంలో ఉన్న గ్రామ దేవత అంకాలమ్మ తల్లి ఆలయం వద్ద గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామస్తులు మేళతాళాలతో గ్రామం నుంచి ఊరేగింపుగా అంకాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుని పొంగళ్ళు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు కురిసి గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో త్వరలోనే వర్షాలు కురిసి రైతుల కష్టాలు తీరాలని ప్రార్థించారు.ఇటీవల ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు వ్యవసాయ పనులపై ఆందోళన చెందుతున్నారు. వర్షాధారంగా సాగు చేసే పంటలకు నీటి కొరత ఏర్పడే పరిస్థితి ఉండటంతో రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు వర్షాలు లేకపోవడంతో పశుపోషకులు కూడా పశువులకు పచ్చిమేత, నీటి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పూర్వకాలం నుంచి గ్రామాల్లో వర్షాలు ఆలస్యమైనప్పుడు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. గతంలో పెద్దలు గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించి వర్షాలు కురవాలని ప్రార్థించేవారని అన్నారు పెద్దల సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ అంకాలమ్మ తల్లికి పూజలు నిర్వహించినట్లు తెలిపారు గ్రామ దేవతను పూజించి మొక్కుకున్నట్లు తెలిపారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సారె వెంకటసుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షులు దేవిశెట్టి నారాయణ, గుడుగుంట్ల వెంకటేశ్వర్లు, సారె సుబ్బారావు, తంగిళ్ళ ఆనందం, గుడుగుంట్ల శ్రీను , తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్యకు అభినందనలు

**గిద్దలూరు సీఐ రామకోటయ్యకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపిన కొమరోలు ఎస్సై నాగరాజు, పోలీస్ సిబ్బంది.**

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 16.**

గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య పోలీస్ శాఖలో ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికై మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల కొమరోలు ఎస్సై నాగరాజు, పోలీస్ స్టేషన్ సిబ్బంది రామకోటయ్యకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. గిద్దలూరు రూరల్ సీ ఐ జె రామకోటయ్య అత్యుత్తమ సేవలను గుర్తించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు రామకోటయ్యను ఉత్తమ పోలీసు ఇన్స్పెక్టర్ అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం భారత 80 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్



విజయ సునీత గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్యకు ఉత్తమ పోలీస్ ఇన్స్పెక్టర్ అవార్డును అందించి అభినందించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం కొమరోలు పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్సై నాగరాజు ,హెడ్ కానిస్టేబుల్ నారాయణ,పోలీస్ కానిస్టేబుల్ రాజేష్ రెడ్డి శివరామకృష్ణ, వీరభద్ర, నాసర్ వలి,, రవి కొండలు,అలీ, తో పాటు పలువురు కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు పీరయ్య, వెంకటేశ్వర్లు, రాజారావు, రామయ్య, తదితర సిబ్బంది, కొమరోలు మండలప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు సిఐ రామకోటయ్యకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

# ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన ఎంఈఓ-2 బూదాల డేవిడ్

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 16**

మండల విద్యాశాఖాధికారి-2గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బూదాల డేవిడ్ ఆదివారం కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహాయ సహకారాలతో విద్యారంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి 1 జె ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్.

**నీతి నిజాయితీ క్రమశిక్షణ అంకితభావానికి మారుపేరుగా నిలిచి పోలీసు శాఖకు వన్నె తెచ్చిన డి.ఎస్.పి, టీవీవీ ప్రతాప్ కుమార్.**

**జాతీయస్థాయిలో ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న ప్రతాప్ కుమార్ కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపిన కొమరోలు పోలీసులు, మిత్రులు.**





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 15**

నీతి నిజాయితీ,,క్రమశిక్షణకు, అంకితభావానికి, విధుల పట్ల చిత్తశుద్ధికి మారుపేరుగా నిలిచిన ఏసీబీ డీఎస్పీ తోట వెంకట వీర ప్రతాప్ కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ జాతీయస్థాయి పురస్కారం అందుకోవటం పట్ల కొమరోలు ఎస్సై నాగరాజు పోలీసు సిబ్బంది తో పాటు ప్రతాప్ కుమార్ మిత్రులు, అభిమానులు ప్రతాప్ కుమార్ కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ప్రతాప్ కుమార్ 1997 నుంచి 2 000 సంవత్సరం వరకు దాదాపు మూడు సంవత్సరాలు పాటు కొమరోలు పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేశారు. ఆయన ఎస్ఐగా పని చేయటం కొమరోలు పోలీస్ స్టేషన్ నుంచి ఆయన సర్వీస్ ప్రారంభమైంది. ఆ తర్వాత ప్రతాప్ కుమార్ బదిలీపై పర్చూరు పోలీస్ స్టేషన్ కు వెళ్లారు.కొంతకాలం పనిచేసిన తర్వాత ప్రతాప్ కుమార్ ను ఇంటెలిజెన్స్ శాఖకు బదిలీ చేస్తూ హైదరాబాద్కు పంపించారు. అక్కడి నుంచి తిరిగి సీఐగా పదోన్నతి పొంది ప్రకాశం జిల్లాలోని కనిగిరి తదితర పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు.అనంతరం ఆయన డిఎస్పీగా పదోన్నతి పొందారు.ఆ మేరకు ప్రతాప్ కుమార్ ను ఏసీబీకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ప్రతాప్ కుమార్ ఏసీబీలో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రతాప్ కుమార్ సేవలను గుర్తించిన కేంద్ర హోం శాఖ ప్రతాప్ కుమార్ ను ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డుకు ఈ ఏడాది జనవరిలో ఎంపిక చేసింది. భారత 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శనివారం విజయవాడలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్ కు భారతదేశ రాజముద్ర, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సంతకంతో కూడిన ఇండియన్ పోలీస్ మెడల్ తో సన్మానించి అభినందించారు. దీనితో ప్రతాప్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు కేంద్ర, రాష్ట్ర పోలీస్ శాఖ ఉన్నత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కాగా తొలిసారి పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులలో చేరిన ప్రతాప్ కుమార్ అంచలంచలుగా పదోన్నతులు పొందుతూ డిఎస్పి స్థాయికి చేరడంతో పాటు జాతీయస్థాయిలో ప్రధానమంత్రి ఉత్తమ సేవా మెడల్ పురస్కారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకోవటం పట్ల కొమరోలు ఎస్సై నాగరాజు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రతాప్ కుమార్ మిత్రులు సీనియర్ జర్నలిస్ట్ జిఎస్ఎం వలి తోపాటు పలువురు మిత్రులు ప్రతాప్ కుమార్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రతాప్ కుమార్ కు శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలిపారు. ప్రతాప్ కుమార్ ప్రధానమంత్రి మెడల్ సేవా పురస్కారానికి ఎంపిక కావడం ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ,కొమరోలు మండలానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ అశోక్ కుమార్

**చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 800 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ**





**సంతమగులూరు, పెన్ పవర్, ఆగస్టు 16**

సంతమగులూరు మండలం కుందుర్రు గ్రామంలో ఆదివారం చింతలపూడి చారిటబుల్ ట్రస్టు అద్దంకి పట్టణంలోని పల్నాడు హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, వారి సతీమణి డాక్టర్ చింతలపూడి రమ్య హారిక 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతలపూడి అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వారికి ఆర్థిక స్తోమత లేక వైద్యానికి దూరంగా ఉంటున్నారని వారికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు . చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు నిర్లక్ష్యం చేసే పేద రైతులకు కుటుంబాలకు, వృద్ధులకు, మహిళలకు, ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో అద్దంకి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వైద్య శిబిరాలు నిర్వహించే సమయాల్లో ప్రజలు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రోహిత్, పల్నాడు హాస్పిటల్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 16**

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ను భక్తులు అధిక సంఖ్యలో సందర్శించి నారాయణ స్వామికి ప్రీతికరమైన రోజు ఆదివారం కావడంతో తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఆలయ ప్రాంగణమంతా "ఓం నమో నారాయణాయ నామస్మరణలతో మార్మోగింది ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా స్వామివారికి పవిత్ర అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోపూజ, అర్చనలు, మహా నైవేద్య కార్యక్రమాలు మంగళ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి సమర్పించిన మహా నైవేద్యాన్ని ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# వేడుకలో పాల్గొన్న... కదిరి పార్ధసారధి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 16**

నికాలపల్లి మాజీ సర్పంచ్ వర్ధరెడ్డి బ్రహ్మారెడ్డి గారి మనవరాలు తాన్విక రెడ్డి ఓణిల వేడుక ఆదివారం సియస్ పురం లోని ఆర్.యం.ఎస్ కల్యాణమండపం లో జరిగింది. ఈ వేడుకలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ కదిరి పార్ధసారధి పాల్గొని తాన్విక ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ చెరుకుపల్లి రాధాకృష్ణ రెడ్డి,మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి, తికణం బాబురావు,ఇరగని చలపతి రావు, షేక్ నాయబ్ రసూల్,మామిడాల కిషోర్,సత్యం రెడ్డి, కె రమణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న -జాడి శ్వేత

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ప్రజానాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా గిద్దలూరులో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న జీవితం పోరాటానికి, త్యాగానికి, సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ధైర్యంగా పాల్గొనడమే కాకుండా, స్వాతంత్ర్యానంతరం రైతులు, గీత కార్మికులు, వెనుకబడిన వర్గాలు, అణగారిన ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. "పదవుల కోసం కాకుండా ప్రజల హక్కుల కోసం పోరాడిన నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న. బీసీల ఆత్మగౌరవాన్ని రాజకీయ, సామాజిక ఉద్యమంగా మలిచిన ఆయన ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం" అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని తెలిపారు. యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ బి.సి.సంక్షేమ సంఘము అధ్యక్షుడు అద్దంకి. మధుసూధనరావు, శాలివాహన సంఘము నాయకులు సుండి.వెంకటరమణ,నాగేళ్ల. వెంకట మోహన్, విశ్వబ్రాహ్మణ సంఘ సేవకులు నీలోజి.సురభయ్య, రజక సంఘ వైస్ ప్రెసిడెంట్ అలసందల పాండు మరియు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్న గారికి ఘనంగా నివాళులు అర్పించారు.



# క్రీడాకారులు యర్రగొండపాలెం పేరు రాష్ట్ర స్థాయిలో నిలపాలి

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్ట్ 16**

క్రికెట్ ప్రపంచ వ్యాపితంగా ఎంతో పేరు గడించిన క్రీడా అని,నేడు ముస్లీమ్ యూత్ సొసైటి ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న క్రీడాకారులు యర్రగొండపాలెం పేరును రాష్ట్ర స్థాయిలో నిలపాలని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు.ఆదివారం ముస్లీమ్ యూత్ సొసైటీ పదవ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును బృందావనం గార్డెన్ లో ఆయన ప్రారంభించారు.ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను యర్రగొండపాలెంకుచెందిన ఏ బి యం టీమ్, యంవైయస్ టీమ్ మధ్య మ్యాచ్‌ను ఎరిక్షన్ బాబు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని గెలుపును ఆనందంగా స్వీకరించడంతో పాటు, ఓటమిని కూడా ఒక విజయానికి బాసటగా భావించాలని,ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అన్నారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి అని అన్నారు.ముస్లిం యూత్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ తమ సొసైటీ ఆవిర్భావం నుండి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని, అన్ని రంగాలలో సేవలు అందిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, సిఐ, కె, అజయ్ కుమార్,మండల సీనియర్ నాయకులు మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, తోట మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, కందుల నారాయణ రెడ్డి, సయ్యద్ అల్లా మాలిక్, సయ్యద్ ముక్తియార్,, క్రీడాకారులు, యువత ముస్లిం యూత్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యకర్తకు ఆర్థిక సహాయం అందించిన బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

**దొనకొండ ఆగస్టు 16 పెన్ పవర్ :**

మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త గుడిమెట్ల చిన్న కోటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు సిటిజన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళగా వెంటనే స్పందించి 20 వేల



రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. మరియు మండల కన్వీనర్ కృష్ణారెడ్డి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది. హాస్పిటల్ కి వెళ్లి మొత్తం 30 వేల రూపాయలు కృష్ణారెడ్డి చేతులు మీదుగా అందజేయడం జరిగింది. వీరి వెంట తాళ్లూరి నగేష్, మోడీ బాలయ్య, గుడిమెట్ల విజయ్, యాకోబు,సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

# బేస్తవారిపేటలో సుభోజనం కార్యక్రమం ప్రారంభం





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

మార్కాపురం జిల్లాలో వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికి ఆహార క్యారేజీ రూపంలో అందించే కార్యక్రమానికి సుభోజనం, మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ సేవా సంస్థలు శ్రీకరం చుట్టాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి, సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ హాజరయ్యారు. బేస్తవారిపేట మండలంలో నా అనేవాళ్ళు ఎవరూ లేక మంచానికే పరిమితమై ఆహారానికి అవస్థలు పడే వృద్ధులను వికలాంగులను గుర్తించి సుభోజనం, మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి స్వచ్ఛంద సేవ సంస్థలు 12 గ్రామాలలో 64 మందికి ఇంటికే ఆహారాన్ని క్యారేజీ రూపంలో రెండు పూటలా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కామూరి రమణారెడ్డి తెలిపారు. మొదటి విడతగా బేస్తవారిపేట మండలంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని జిల్లాలో మరింత విస్తరిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. ఇప్పటికే గిద్దలూరు, కొమరోలు, మండలాలలో రాజన్న భోజనశాల పేరిట రూ.5 కడుపునిండా భోజనం అందించే కార్యక్రమాన్ని 9 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని కామూరి రమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఇమ్మడి తిరుపతయ్య, అధ్యక్షులు, వెంకటేశ్వర రెడ్డి, సహాయ అధ్యక్షుడు, తులసి ప్రసాద్, దద్దనాల గోపాల్, పరిషత్ పోయిన గోపాల్, నాగేశ్వరరావు, సంస్థ అధ్యక్షులు మేకల రామ్మోహన్రావు, కోశాధికారి వెంకటరాయుడు, కార్యక్రమానికి హాజరైన వారు.. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు స్వరూప రెడ్డి, బాదం గోపాల్, మోహన్ రెడ్డి, ఆర్గనైజర్ సెక్రెటరీ దూదేకులవలి, మెంబర్స్, నాగ సురేష్, ప్రసాద్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన అండర్ 19 బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు

- మిక్స్ డబుల్స్ ఫైనల్స్ విజేతలు కరామత్ హు ల్షాక్... దీపిక.
- బాలికల సింగిల్స్ విజేత దీపతి - బాలుర సింగిల్స్ విజేత లక్ష్మీ వ్యాషక్
- విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్..

న్యూరాలజి వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

గత అయిదు రోజులుగా ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ లో జరుగుతున్న యోనెక్స్ సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ 2026 అండర్ 19 బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎంతో ఉత్కంఠ భరితంగా నువ్వా నేనా అన్నట్లు గా సాగిన ఫైనల్ మ్యాచ్ లో బాలబాలికలు పోటీలు పడి ఆడారు. వీక్షకుల హర్షధ్వానాలు, చప్పట్లతో ఫైనల్ పోటీలు ఉత్సాహ భరితంగా ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ ల ముగింపు అనంతరం లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ మాట్లాడుతూ మిక్సడ్ డబుల్స్ ఫైనల్స్ లో ప్రకాశం జిల్లా కు చెందిన కరామత్ హుల్షాక్, గుంటూరు కు చెందిన దీపిక విజేతలుగా లక్ష్మి వైశాక్, స్ఫూర్తి రన్నర్స్ గా నిలిచారాని,బాలికల సింగిల్స్ లో కాకినాడ కు చెందిన త్రిషిష్టా దీపతి విజేతగా,కాకినాడ కు చెందిన విజయలక్ష్మి రన్నర్ గా నిలిచారాని తెలిపారు. అలాగే బాలుర సింగిల్స్ లో విశాఖపట్నం కు చెందిన లక్ష్మి వ్యాషక్ విజేతగా,వెస్ట్ గోదావరి కి చెందిన లక్ష్మి శ్వేతన్ రన్నర్ గా,బాలికల డబుల్స్ లో వెస్ట్ గోదావరి కి చెందిన రుత్విక,వెస్ట్ గోదావరి కి చెందిన మనోజ విజేతలుగా,సిరి హాసిని,స్ఫూర్తి రన్నర్స్ గా నిలిచారాని తెలిపారు. బాలుర డబుల్స్ లో విశాఖపట్నం చెందిన లక్ష్మి వ్యాషక్,విశాఖపట్నం కు చెందిన కె రాహుల్ విజేతలు గా,అభిషేక్ లక్ష్మి శ్వేతన్ రన్నర్స్ గా నిలిచినట్లు మురళి కృష్ణ తెలిపారు. టోర్నమెంట్ లో ఉత్తమ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ అమలు చైర్మన్ లంకా దినకర్, ఒంగోలు కు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్







డా. చంద్ర శేఖర్ చేతుల మీదగా ట్రోఫిలు.. ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బ్యాట్మెంటన్ పోటీల నిర్వహణను అభినందించారు. ఒంగోలులో అత్యాధునిక వసతులు శిక్షణ అందిస్తూ ప్రకాశం జిల్లాలో బ్యాట్మెంటన్ ఆటలలో ఔత్సాహిక చిన్నారులను తీర్చిదిద్ది వారికి శిక్షణ ఇచ్చి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను అందిస్తున్న లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ వారి టీమును లంకా దినకర్ అభినందించారు. క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని ఓటమిని స్ఫూర్తిగా తీసుకొని రాబోయే టోర్నమెంట్స్ లో పట్టుదలతో ఆడి తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన అవసరం క్రీడాకారులకు ఉండాలని, తదనుగుణంగా క్రీడాకారులు మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలని క్రీడాకారులకు సూచించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక దృఢత్వానికి దోహదపడతాయని క్రీడాకారులు అత్యుత్తమ స్థాయిలో పోటీలలో పాల్గొని రాష్ట్రానికి పేరు తేవాలని కోరారు. లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ అందిస్తున్న శిక్షణను అందిపుచ్చుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, కార్యదర్శి పి.విజయ కృష్ణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రఘుబాబు, అశోక్ రెడ్డి,దండు శ్రీనివాసరావు, కోడె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత కంఠస్థ పోటీలకు విద్యార్థులకు శిక్షణ

- చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 16**

జ్ఞానగీతగా భగవంతుని దివ్యవాణిగా పేరొందిన భగవద్గీతలోని శ్లోకాలను విద్యార్థులకు తరగతుల వారీగా అధ్యాయాల వారీగా శిక్షకుల ద్వారా నేర్పించి వారిని భగవద్గీత కంఠస్థ పోటీలకు పంపనున్నట్లు చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో ఏర్పాటైన శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులలో చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద పాల్గొని విద్యార్థులకు భగవద్గీత ప్రాశస్త్యాన్ని గురించి వివరించారు. విద్యార్థులలో కథా సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని గమనించిన స్వామి సత్యాత్మానంద విద్యార్థులే స్వయంగా కథలను చెప్పగలిగే విధంగా ప్రోత్సహిస్తున్నారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 9.30 నుండి 11 గంటల వరకు జరిగే శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జ్ఞానవంతులుగా ఎదగాలని కోరారు.

## ఒడియ రాజుల ఆరామ క్షేత్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్






**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 16**

అందరూ కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. స్థానిక అంజయ్య రోడ్డులో ఒడియ రాజుల ఆరామ క్షేత్రాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ కలిసి వచ్చి తమకు కావాల్సినవి సాధించుకోవచ్చు అన్నారు. అన్ని కులాల వారు ఆరామ క్షేత్రాన్ని కట్టుకున్నారని మిగిలిన వారికి సాయం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, టిడిపి నాయకులు దాయినేని ధర్మ, పెద్దిశెట్టి వరలక్ష్మి, ఒడియా రాజుల ఆరామ క్షేత్ర కమిటీ అధ్యక్షులు కుంచాల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షురాలు తమ్మిశెట్టి రమాదేవి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ , ఉపాధ్యక్షులు పి. వెంకటేశ్వరరావు, మహిళా ఉపాధ్యక్షురాలు గుంజి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రవాణా, భద్రత సాధికారతకు ఏడాది పూర్తి స్త్రీ శక్తి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గిద్దలూరు నియోజకవర్గం ఎపి ఎస్ ఆర్టీసీ బస్ స్టాండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 80వ వార్షికోత్సవం, అలాగే మహిళా రవాణా, భద్రత ఽ సాధికారతకు ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్త్రీ శక్తి బస్సులో ప్రయాణిస్తూ, బస్సు కండక్టర్‌తో పాటు మహిళా ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ద్వారా వారు పొందుతున్న ప్రయోజనాలు, ప్రయాణ సమయంలో ఎదురవుతున్న అనుభవాలు, పథకంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఎమ్మెల్యే వివరాలు తెలుసుకున్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

## పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ అందజేసిన మాదినేని లక్ష్మణ్



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 16**

మండలంలోని అరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు ఒంగోలు వెంకటేశ్వర్లు అన్నారు. పాఠశాల విద్యార్థుల తాగునీటి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బిజెపి జిల్లా మాజీ ఓబిసి మోర్చా అధ్యక్షులు మాదినేని లక్ష్మణ్ వాటర్ డిస్పెన్సర్ ను పాఠశాల

### అభినందించిన ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయులు ఒంగోలు వెంకటేశ్వర్లుకు అందజేశారుఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఒంగోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందించే పథకాలతో పాటు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలలకు అవసరమైన వస్తువులను అందించడం పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి వాటర్ డిస్పెన్సర్ ను అందించిన మాదినేని లక్ష్మణ్ పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ వాటర్ డిస్పెన్సర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు విద్యార్థుల సౌకర్యాల కోసం దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన మాదినేని లక్ష్మణ్ పలువురు అభినందించారు ఈ సందర్భంగా దాత మాదినేని లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని ఉద్దేశంతో వాటర్ డిస్పెన్సర్ ను అందజేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ నిర్వాసితులకు 6 నెలల సమయం ఇవ్వాలి

చట్టాన్ని ఉల్లంఘిస్తే ప్రతిఘటన తప్పదు - సిపిఎం రమాదేవి హెచ్చరిక-

**మార్కాపురం పెన్ పవర్, ఆగస్టు 16:**

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి ఆరోపించారు. ఆదివారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వెలిగొండ పరిధిలోని 11 ముంపు గ్రామాల ప్రజలు 74 వేల ఎకరాలు తక్కువ ధరకే ఇచ్చారని, గృహాలకు కూడా తక్కువ పరిహారమే ఇచ్చారని తెలిపారు. 2019లోనే ప్యాకేజీ నిర్ణయించినా ఇంతవరకు ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పుడు ఇచ్చి ఉంటే రైతులకు పొలం, ఇల్లు కట్టుకునే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఇచ్చే డబ్బుతో ఒక సెంటు కూడా రాదని అన్నారు. కాంట్రాక్టర్లకు మాత్రం అంచనాలు పెంచి లాభాలు చేకూరుస్తున్నారని విమర్శించారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపకుండా గ్రామాలు ఖాళీ చేయాలనడం చట్ట ఉల్లంఘన అన్నారు. ముందస్తు నోటీసులు లేవని, ఇప్పటికిప్పుడు ఖాళీ చేస్తే పెట్టిన పెట్టుబడులు మునిగిపోతాయని చెప్పారు. నిర్వాసితుల కోసం మార్కాపురంలోని టిడ్కో ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామాలు ఖాళీ చేసేందుకు కనీసం 6 నెలల సమయం




ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. 2019 నుండి 2025 ఆగస్టు వరకు 18 ఏళ్లు నిండిన యువతను కూడా ప్యాకేజీలో చేర్చాలని కోరారు.నిర్వాసితులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని, సిపిఎం అండగా ఉంటుందని రమాదేవి హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య, ఊస వెంకటేశ్వర్లు, కే. మల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలచెరువు దర్గాలో ప్రత్యేక పూజలు

వెలిగొండ నీటి విడుదలకు ఆటంకాలు రాకూడదని కందుల ప్రార్థన



**తర్లుపాడు పెన్ పవర్ ఆగస్టు 16:**

మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని ప్రఖ్యాత పీర్ల దర్గాలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.వెలిగొండ ప్రాజెక్ట్ నుండి త్వరలో నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో నీటి విడుదలకు ఎటువంటి ఆటంకాలు రాకూడదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆయురారోగ్యాలతో ఉండాలని దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలోనే మార్కాపురం జిల్లాను సాధించామని, వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి వచ్చే 10 రోజుల్లో



నీటిని విడుదల చేస్తామని చెప్పారు.ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం హార్టికల్చర్ హబ్ గా ప్రకటించిందని, వచ్చే 2-3 ఏళ్లలో హార్టికల్చర్, అనుబంధ రంగాల్లో వేల కోట్ల పెట్టుబడులు వచ్చి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇంటింటికి పైప్ లైన్ పనులు జరుగుతున్నాయని, త్వరలో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చిన్న చిన్న విభేదాలు వీడి కలిసికట్టుగా పని చేసి 100% స్ట్రైక్ రేటుతో గెలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది

- ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి




**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఎంతో ఉందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 16వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు కే.ఆర్ సూర్యనారాయణ కృషి వల్లనే మనకు నాయకులుగా సమాజంలో గుర్తింపు లభించిందని చెప్పారు. తదుపరి సూర్యనారాయణకు ప్రకాశం జిల్లా అన్ని విధాలుగా అండదండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, తాలూకా అధ్యక్షులు సురేష్ బాబు, పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాస యాదవ్, శ్రీదేవి మహిళా విభాగం అధ్యక్షురాలు రజిత మానస, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి వనజ, ప్రసన్న, సుజాత, చెంచారావు,శ్రీనాథ్ బాబు, శ్రీవత్సవ, రవిశంకర్, చంద్రశేఖర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగినేని శ్రీనివాసరావు, కొనికి శ్రీనివాసులు, ఈదర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న గ్రంథపాలకుడు ఆళ్ళ భాస్కరరావు



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 16**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడిగా సేవలందిస్తున్న ఆళ్ల భాస్కరరావుకు ఉత్తమ గ్రంథపాలకుడిగా సేవా పురస్కారం లభించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పాఠకులకు మెరుగైన సేవలు అందించడంలో ఆళ్ల భాస్కరరావు చూపిన ప్రత్యేక చొరవను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ నిర్వహణ, గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణతో పాటు పాఠకులను గ్రంథాలయం వైపు ఆకర్షించేలా పలు కార్యక్రమాలు చేపట్టడం ఆయన సేవలకు గుర్తింపుగా నిలిచింది.ఈ సందర్భంగా ఆళ్ల భాస్కరరావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసిన గ్రంథాలయ చైర్మన్, కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ గ్రంథాలయ అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఆళ్ల భాస్కరరావుకు ఉత్తమ అవార్డు లభించడం పట్ల పలువురు గ్రామస్తులు, పాఠకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పాఠకులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఆయనకు ఈ పురస్కారం దక్కడం అభినందనీయమని అన్నారు

# చరిత్రలో నిలిచిపోయేలా ఒంగోలు మునిసిపాలిటీ 150 ఏళ్ల వేడుకలు

## మన ఒంగోలు... మన గౌరవం ! - ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## - మంత్రి స్వామి, కలెక్టర్ రాజబాబు, ఎమ్మెల్యే దామచర్ల పిలుపు - అట్టహాసంగా వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ











**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

ఒంగోలుకు ఎంతో చారిత్రక విశిష్టత ఉందని, ఈ ఘన చరితను చాటి చెప్పేలా, చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచేలా నిర్వహించే వేడుకలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి సెప్టెంబర్ 30వ తేదీకి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అట్టహాసంగా జరిగింది. మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, ఇతర ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సొంత ఊరు అంటే ప్రతి ఒక్కరికీ ఎంతో ఇష్టం ఉంటుందన్నారు. గ్రామం నుంచి పట్టణముగా, నగరంగా అభివృద్ధి చెందిన మన జిల్లా కేంద్రమైన ఒంగోలుకు కూడా గొప్ప చరిత్ర ఉందన్నారు. ఈ నగరం మరింత విస్తరిస్తున్న నేపథ్యంలో మహిళల భద్రత, శాంతిభద్రతలలో మేటిగా నిలుస్తూ అత్యంత జీవనానుకూల నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మన ఒంగోలు – మన గౌరవం అన్నారు. ఈ నగర గొప్పతనాన్ని భావితరాలకు తెలిపేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఒంగోలు నగరాన్ని అత్యంత సుందరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. సుందర నగరం అంటే మన ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. ఈ ఏడాది డిసెంబర్లో ఒంగోలు నగరంలోనే ప్రపంచ బాలల తెలుగు మహాసభలు ఉన్నాయని, వచ్చే అతిథులకు మన నగర గొప్పదనాన్ని తెలిపేలా కూడా ఈ వేడుకలు, సుందరీకరణ, అభివృద్ధి పనులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ 40 ఏళ్ల నాటి తాగునీటి పైపు లైన్లను మారుస్తున్నామని, మరో 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను చేస్తున్నామని చెప్పారు. డ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. మంగమూరు రోడ్డు, శ్రీనివాస థియేటర్, ట్రంకు రోడ్డు, కొత్తపట్నం రోడ్ల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే శానిటేషన్, విద్యుదీకరణ, సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి చేశామన్నారు. ఈ అభివృద్ధి పనులను మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఈ క్రమంలో నిర్వహించే 150 ఏళ్ల వేడుకలలో నగరానికి చెందిన వివిధ రంగాలలోని ప్రముఖులను కూడా ఆహ్వానిస్తామన్నారు. ఈ వేడుకలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజలందరూ కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ వేడుకల నిర్వహణ, అభివృద్ధి పనులకు సంబంధించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, ఇతర అధికారులు, ఒంగోలు నగర మాజీ మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు మునిసిపల్ మాజీ ఛైర్మన్ యక్కల తులసీరావు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా అటల్ బిహారి వాజపేయి వర్ధంతి నిర్వహణ :బీజేపీ నివాళులు



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 16**

మాజీ ప్రధాని, భారతీయ జనతా పార్టీ మొదటి అధ్యక్షులు అటల్ బిహారి వాజపేయి వర్ధంతిని ఆదివారం మార్కాపురంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పి.వి. కృష్ణారావు సూచన మేరకు, పట్టణ అధ్యక్షులు శాతరాజుపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు పైడిమర్రి శ్రీనివాసులు, దేవిశెట్టి చంద్రశేఖర్,రాజా శ్రీకాంత్ , పట్టణ ప్రధాన కార్యదర్శి గొల్ల సతీష్ కుమార్ , ఎస్.ఐ.ఆర్ జిల్లా కన్వీనర్ మండ్ల శివప్రసాద్ , బీజేవైఎం నాయకులు యక్కలి కమలగుప్తా తదితరులు పాల్గొని వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# అవోపా ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గిద్దలూరు లో అవోపా ఆధ్వర్యంలో 2025 ఆగస్టు నుండి 2026 జులైలో పదవి విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ప్రతి ఏడాది పదవీవిరమణ చేసిన ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల ను అవోపా ఆధ్వర్యంలో సన్మానం చేయటం ఆనవాయితి. ఆక్రమంలో గిద్దలూరు లో ఏబీసీడబ్ల్యుఓ గా పనిచేసి పదవి విరమణ చేసిన దమ్మాల హరిప్రసాద్, సంజీవరాయుని పేట లో హెచ్ డబ్ల్యు ఓ గా పనిచేసి పదవి విరమణ చేసిన శివపురం వెంకట ప్రభాకర రావు ఆర్టీసీ గొర్రె శేఖర్, ఎమ్ వి ఎస్ వెంకటేశ్వరరావు ఎస్ సుబ్బారావు డి పిచ్చయ్య , జి లక్ష్మి నారాయణ ఎన్ శ్రీనివాసులను దుశ్శాలువ జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

# వ్యాసరచనలో అమరావతి స్కూల్ విద్యార్థినికి 'గోల్డ్' పతకం

## గ్రామీణ ప్రాంతంలో మెరిసిన ఆణిముత్యం



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని ప్రతిభకు ఆకాశమే హద్దు అని నిరూపించింది ముండ్లపాడు గ్రామానికి చెందిన అమరావతి పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని గద్దె నాగా రవళి. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్లూ రూట్స్ న్యాచురల్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో అమరావతి పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని గద్దె నాగా రవళి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. స్థానిక శ్రీ సీతా రామ కళ్యాణ మండపంలో ఆదివారం గిద్దలూరు మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు బ్లూ రూట్స్ న్యాచురల్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ బాబు చేతుల మీదుగా నాగా రవళి బంగారు పతకాన్ని అందుకోగా, సభలో హాజరైన పలువురు ప్రముఖులు విద్యార్థిని నాగా రవళి ప్రతిభను కొనియాడారు. గ్రామీణ విద్యార్థుల్లో ఉన్న పట్టుదలను, సృజనాత్మకతను వెలికితీసేలా పోటీలు నిర్వహించిన బ్లూ రూట్స్ న్యాచురల్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రతినిధులకు అమరావతి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# నేడు ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో ప్రతి నెలలో మూడవ సోమవారం నిర్వహించే ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సోమవారం నిర్వహించనున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీటింగ్ హాలు నందు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తగలకు చెందిన ప్రజలు, ఎస్సీ ఎస్టీ కుల సంఘాలకు సంబంధించిన వారి నుండి అర్జీలను స్వీకరించునున్నారు. కావున సమస్యలకు సంబంధించిన అర్జీలను జిల్లా కలెక్టర్ రాజా బాబు, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, జిల్లా రెవిన్యూ అధికారికి, ఇతర అధికారులకు సమర్పించుకోవాలని కలెక్టరేట్ కార్యాలయం తెలిపింది.

# గుర్తు తెలియని వాహనము ఢీ కొని సాంబార్ జింక మృతి

## పరిశీలిస్తున్న అటవీ అధికారులు





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

నల్లమల ఆటవిఘాట్ రోడ్డులో గుర్తుతెలియని వావనం ఢీ కొని సాంబార్ జింక మృతి చెందింది ఈసంఘట న ఆదివారం రాత్రి చోటుచేసుకుంది గుండ్లకమ్మ రేంజ్ పరిధిలోని గిద్దలూరు--నంద్యాల ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక సాంబర్ జింక మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. సుమారు రాత్రి 8:30 గంటల సమయంలో, దిగువమెట్ట స్టీల్ బ్రిడ్జి దాటిన అనంతరం రహదారిపైకి వచ్చిన సాంబర్ జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే అటవీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతి చెందిన సాంబర్ జింకను అటవీ శాఖ నిబంధనల ప్రకారం పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టారు. వన్యప్రాణులు రహదారులు దాటే ప్రాంతాల్లో వాహనదారులు వేగాన్ని నియంత్రించి, అప్రమత్తంగా వాహనాలు నడపాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వన్యప్రాణుల సంచారం ఉండే ప్రాంతాల్లో మరింత జాగ్రత్తగా ప్రయాణించాలని గుండ్లకమ్మ రేంజ్ అధికారులు కోరారు.

# గిద్దలూరు మున్సిపాలిటీ లో ఇక 28 వార్డులు ఏర్పడనున్నాయి

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గిద్దలూరు మున్సిపాలిటీలో 28 వార్డులు ఏర్పడనున్నాయి గతంలో గిద్దలూరు నగర పంచాయతీగా ఉన్న సమయంలో 20 వార్డులు ఉండగా, ప్రస్తుతం వార్డుల సంఖ్య 28కి పెరిగనుంది వార్డుల పెంపుతో పట్టణంలోని ప్రతి ప్రాంతానికి మెరుగైన ప్రాతినిధ్యం లభించడంతో పాటు, ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. కొత్త వార్డుల ఏర్పాటుతో గిద్దలూరు పట్టణ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# మైలవరంలో మంత్రముగ్ధులను చేసిన 'శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ చరిత్ర'

## రంగస్థల కళా వైభవాన్ని చాటిన పౌరాణిక పద్య నాటకం





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 16:**

అద్దంకి మండలం, మైలవరం గ్రామంలో ప్రదర్శించిన 'శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ చరిత్ర' పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సమితి, భాషా సాంస్కృతిక శాఖల ఆర్థిక సహకారంతో శ్రీ కనకదుర్గ నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శనను జనరంజకంగా నిర్వహించారు. పౌరాణిక పద్య నాటకాలకు ఆదరణ తగ్గుతున్న తరుణంలో ఈ ప్రదర్శన రంగస్థల కళా వైభవాన్ని మరోసారి చాటిచెప్పింది.

**పాత్రల్లో జీవించిన కళాకారులు..**

నాటకం ప్రారంభం నుంచి ముగింపు వరకు కళాకారులు కేవలం నటించకుండా పాత్రల్లో జీవించి మెప్పించారు. ముఖ్యంగా కొల్లా. శివరామయ్య దంపతుల వద్దకు కాకాని. కృష్ణయ్య, వెంకమాంబలు సంబంధం మాట్లాడటానికి వచ్చిన సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. తిరుపతమ్మను అత్తవారింట వేధింపులకు గురిచేసే ఘట్టాలు, కుమార్తె పరిస్థితిని చూసి తల్లిదండ్రులు పడే ఆవేదనను కళాకారులు అత్యంత సహజంగా ఆవిష్కరించారు. భర్త మరణానంతరం తిరుపతమ్మ అగ్ని ప్రవేశం చేసే సన్నివేశం, దానికి అనుగుణంగా సాగిన పద్య గానం ప్రేక్షకులను కట్టిపడేశాయి. పలువురు వీక్షకులు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు.

**ఆకట్టుకున్న ప్రదర్శన..**

శ్రీ కనకదుర్గ నాట్యమండలి బృందం సమష్టి కృషితో ప్రదర్శన విజయవంతమైంది. మన్నేపల్లి గురుస్వామి, సాధు బ్రహ్మయ్య, బి. కృష్ణారెడ్డి, ఎన్.ఎస్.ఎస్. నాయుడు, రమణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, అంజయ్య, తిరుమలభి, ఆమని, సుగుణ, కోటి తదితర కళాకారులు వివిధ పాత్రల్లో అద్భుత నటన కనబరిచి ప్రేక్షకుల మన్ననలు పొందారు. పల్లె వేదికపై పద్య నాటకానికి లభించిన ఈ విశేష స్పందన, సంప్రదాయ కళలకు ప్రజల హృదయాల్లో ఇంకా సుస్థిర స్థానం ఉందని నిరూపించింది.

# ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

## కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి , సంక్షేమం సాధ్యం ఎమ్మెల్యే ముత్తుముల






**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజార్ 17 వ వార్డు లో " ఇంటింటికీ కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు " కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు , ప్రజలు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు వార్డు లోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం వార్డు నాయకులు, మహిళలు ప్రజలు " ఎమ్మెల్యే ను శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పులిని వధించి కేసులో ముద్దాయి ఆత్మహత్య యత్నం

## గది తలుపు అద్దాలు పగులగొట్టి గ్లాసుతో పొట్ట పై చేతుల పై గాయాలు చేసుకున్నట్లు సమాచారం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 16**

గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్ల మండలం జెల్లీవారి పుల్లలచెరువు సమీపంలోని పులి నీ చంపిన కేసులో నిందితులుగా ఉన్నా వారిని శని వారం గిద్దలూరు ఫారెస్టు అధికారులు నిందితులను విచారణ నిమిత్తం మార్కాపురం జైల్ నుంచి కస్టడీలోకి తీసుకొచ్చారు అధికారులు విచారణ విచారణ చేపట్టగా ముద్దాయి లలో చోళ్ళ వీడు గ్రామానికి చెందిన రంగస్వామి అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. ఆ నిందితుని ప్రభుత్వవైద్య శాలకు తరలించి చికిత్స జరిపించారు ఇప్పటికీ అటవీశాఖ అధికారులు ఆత్మహత్య కు పాల్పడిన వ్యక్తి గురించి గోప్యంగా ఉంచడం మరొక విశేషం..

# గాలే టెస్టుపై భారత్ పూర్తి ఆధిపత్యం.. పడిక్కల్ భారీ ఇన్నింగ్స్ తో పటిష్ఠ స్థితి

గాలేలో టీమిండియా-శ్రీలంక తొలి టెస్టు

తొలి ఇన్నింగ్స్ లో దేవదత్ పడిక్కల్ భారీ సెంచరీ (167)

కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ అర్ధశతకాలు

రెండో రోజు ముగిసేసరికి 9 వికెట్లకు 460 పరుగులు చేసిన టీమిండియా

లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్యకు 4, కేశర నువంతకు 3 వికెట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై టీమిండియా పూర్తి పట్టు సాధించింది. యువ ఓపెనర్ దేవదత్ పడిక్కల్ (167) బాదిన అద్భుత శతకానికి, కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) సాధించిన కీలక అర్ధ శతకాలు తోడవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 460 పరుగుల భారీ స్కోరు చేసింది. వర్షం కారణంగా రెండో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, భారత బ్యాటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు.వర్షం వల్ల తొలి సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో, రెండో రోజు కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా పడిక్కల్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ భారీ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి తోడుగా రాహుల్, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను శ్రీలంక స్పిన్నర్లు కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత 3 వికెట్లు పడగొట్టగా, సీనియర్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య 4 వికెట్లతో రాణించాడు. రెండో కొత్త బంతితో లంక బౌలర్లు పుంజుకొని వరుసగా వికెట్లు తీశారు. రవీంద్రదం

జడేజా (13)ను నువంత ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు.అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ దూకుడుగా ఆడాడు. కేవలం 68 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 51 పరుగులు చేసి జట్టు స్కోరును 400 దాటించాడు. అయితే, అర్ధ శతకం పూర్తయిన వెంటనే జయసూర్య బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న కెప్టెన్

ధనంజయ డిసిల్వా అద్భుతమైన డైవింగ్ క్యాచ్ పట్టడంతో జురెల్ వెనుదిరిగాడు. చివర్లో మహమ్మద్ సిరాజ్, మానవ్ సుతార్ (24) వేగంగా పరుగులు జోడించారు.రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. క్రీజులో కుల్‌దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) ఉన్నారు. కాగా, టీమిండియా తన ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసి, మూడో రోజు ఉదయాన్నే శ్రీలంకను బ్యాటింగ్ కు ఆహ్వానించి, వారి లైనప్ ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంది.

# సచిన్, మంజ్రేకర్ క్లబ్‌లోకి యశస్వి.. గాలే టెస్టులో అరుదైన ఘనత

- ఆడిన 30 టెస్టులను 30 వేర్వేరు వేదికల్లో ఆడి సచిన్ క్లబ్‌లో చేరిన జైస్వాల్
- ఈ మ్యాచ్‌లో 32 పరుగుల వద్ద దురదృష్టవశాత్తూ రనౌట్‌గా వెనుదిరిగిన యశస్వి
- తొలి టెస్ట్ సెంచరీతో కదం తొక్కిన యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్
- 77 పరుగులతో రాణించి కండరాల నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్
- తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 288 పరుగులతో పటిష్ఠ స్థితిలో భారత్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బరిలోకి దిగడం ద్వారా అతను భారత దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సంజయ్ మంజ్రేకర్ క్లబ్‌లోకి చేరాడు. జైస్వాల్ తన కెరీర్‌లో ఆడిన 30 టెస్టులను 30 వేర్వేరు వేదికలపై ఆడటం విశేషం. గతంలో సంజయ్ మంజ్రేకర్ వరుసగా 33 టెస్టులు, సచిన్ టెండూల్కర్ 32 టెస్టులు వేర్వేరు మైదానాల్లో ఆడి ఈ జాబితాలో ముందున్నారు.అయితే, ఈ ప్రత్యేక మ్యాచ్‌లో జైస్వాల్‌కు నిరాశే ఎదురైంది. 32 పరుగులు చేసిన అతను, కేఎల్ రాహుల్‌తో సమన్వయ లోపం కారణంగా రనౌట్‌గా వెనుదిరిగాడు. సింగిల్ తీసే ప్రయత్నంలో ఫీల్డర్ అడ్డురావడంతో జైస్వాల్ జారిపడగా, ఇద్దరు బ్యాటర్లు ఒకే ఎండ్‌కు చేరుకున్నారు. దీంతో జైస్వాల్ పెవిలియన్ చేరాల్సి వచ్చింది. టెస్టుల్లో అతను రనౌట్ కావడం ఇది మూడోసారి.మరోవైపు, ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పడిక్కల్, తన తొలి టెస్ట్ శతకాన్ని నమోదు చేశాడు. శ్రీలంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో కేఎల్ రాహుల్ కూడా నిలకడగా ఆడి 77 పరుగులు చేశాడు. అయితే, కండరాల నొప్పితో అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు.పడిక్కల్ సెంచరీ భారత జట్టుకు ఎంతో కీలకంగా మారింది. 2024 సెప్టెంబర్‌లో శుభ్‌మన్ గిల్ తర్వాత, భారత జట్టు తరఫున వన్‌డౌన్‌లో సెంచరీ చేసిన బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. ఈ మధ్యకాలంలో భారత్ ఈ స్థానంలో ఏడుగురు బ్యాటర్లను ప్రయత్నించగా,

వారు పేలవ ప్రదర్శన కనబరిచారు.తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 2 వికెట్ల నష్టానికి 288 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. క్రీజులో దేవదత్ పడిక్కల్ (131 నాటౌట్), రిషభ్ పంత్ (27 నాటౌట్) ఉన్నారు. లంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత్, తొలి రోజు ఆటను తమ నియంత్రణలో ఉంచుకుంది. ఇక, ఇవాళ రెండో రోజు ఆట వర్షం కారణంగా ఇంకా ప్రారంభం కాలేదు.

# నా విషయంలో కోహ్లీ చాలా పెద్ద తప్పు చేశాడు.. విరాట్?ని పొట్టు పొట్టు తిట్టిన జడ్డూ భాయ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తన టెస్టు కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదుర్కొన్న తీవ్రమైన మానసిక ఒత్తిడి, బ్యాటింగ్ స్థానాల మార్పులపై సంచలన విషయాలను బయట పెట్టాడు. కెరీర్ తొలి దశలో డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ, టీమిండియాలో తగిన బ్యాటింగ్ స్థానం దక్కకపోవడం తన ఆత్మవిశ్వాసాన్ని ఎలా దెబ్బతీసిందో జడేజా షేర్ చేసుకున్నాడు. డైరెక్ట్‌గా ఎవరి పేరు చెప్పనప్పటికీ, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ కెప్టెన్సీలలో తనను లోయర్ ఆర్డర్‌కే పరిమితం చేసిన కాలాన్ని గుర్తు చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**డొమెస్టిక్ క్రికెట్‌లో 60ం యావరేజ్:**

సోనీ స్పోర్ట్స్‌లో సంజయ్ మంజ్రేకర్‌తో జరిగిన సంభాషణలో జడేజా తన భావోద్వేగాలను పంచుకున్నాడు. రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ వంటి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 60ంకి పైగా బ్యాటింగ్ సగటుతో 8,337 రన్స్ సాధించిన రికార్డు తనకున్నప్పటికీ, భారత జట్టులోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది.. తనను 8 లేదా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపేవారని గుర్తు చేసుకున్నాడు. కొన్నిసార్లు రవిచంద్రన్ అశ్విన్ కంటే వెనుక స్థానంలో కూడా తాను బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చిందని వెల్లడించాడు.

**నాపై నమ్మకం లేదనుకునేవాడిని:**

రవీంద్ర జడేజా తన మానసిక స్థితిని వివరిస్తూ: నేను ప్యాడ్లు కట్టుకుని బ్యాటింగ్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్న తరుణంలో, డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ఫాస్ట్ బౌలర్లు మ్యాచ్‌లో బౌలింగ్ చేయడానికి సిద్ధమయ్యేవారు.. అంటే నేను త్వరగా అవుటైపోతానని, బౌలింగ్ వేసే సమయం వచ్చేసిందని వారు భావించేవారు. ఆ పరిస్థితులు చూసి నా కాన్ఫిడెన్స్ బాగా దెబ్బతినేది. ఛా.. ఏంటి ఇది? జట్టు యాజమాన్యానికి నా బ్యాటింగ్‌పై కనీస నమ్మకం కూడా లేదా? అని నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని.. కానీ అదృష్టవశాత్తూ ఇప్పుడు నాకు 6వ స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం లభించిందని జడ్డూ భాయ్ చెప్పుకొచ్చాడు.

**కోహ్లీ, ధోనీ హయాంలో బ్యాటింగ్ రికార్డులు ఇవే:**

2012లో ఎంఎస్ ధోనీ కెప్టెన్సీలో టెస్ట్ అరంగేట్రం చేసిన రవీంద్ర జడేజా, ఆ తర్వాత విరాట్ కోహ్లీ నాయకత్వంలో ఎక్కువ కాలం ఆడాడు. తన టెస్టు కెరీర్‌లో జడేజా ఏకంగా 32 సార్లు 8వ స్థానంలో, 12 సార్లు 9వ స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇక ఏఏ స్థానాల్లో జడ్డూ బ్యాటింగ్ చేశాడో ఇప్పుడు తెలుసుకుందాం..



మాధురీ జైన్ జగన్ గందరగోళం లో ప్రశాంతత నెలకొంది

# శ్రీహరి వారసుడు.. ఈసారి భయపెట్టాలా థ్రిల్లర్ లుక్




రియల్ స్టార్ శ్రీహరి వారసుడు మేఘాంశ్ మరో డిఫరెంట్ కాన్సెప్ట్ తో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఆ కొత్త సినిమా రీసెంట్ గానే మొదలైంది. 'ఆస్మాన్' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేశారు. ఇక ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను లేటెస్ట్ గా శ్రీహరి జయంతి సందర్భంగా రిలీజ్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో చేతిలో పాత లాంతరు పట్టుకుని మేఘాంశ్ కనిపిస్తున్నాడు. లాంతరు చుట్టూ పగిలిపోతున్న గాజు, వెనుక చీకటి వాతావరణంతో లుక్‌ను రఫ్‌గా డిజైన్ చేశారు.మోషన్ పోస్టర్‌లో ఫైర్, పెద్ది చేయి లాంటి విజువల్స్ కూడా చూపించారు. కథను చెప్పకుండా జానర్ మీద మాత్రం చిన్న హింట్ ఇచ్చేలా మొత్తం పోస్టర్ ఉంది. మేఘాంశ్‌కు 'ఆస్మాన్' కీలకమైన సినిమా. 2019లో 'రాజ్‌దూత్'తో హీరోగా పరిచయమైన ఈ యువ హీరోకు ఆ తర్వాత పెద్ద గ్యాప్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ లీడ్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు.రెగ్యులర్ కథ కాకుండా థ్రిల్లర్ జానర్‌లో కొత్తగా ప్రయత్నించాలని ఫిక్స్ అయ్యాడు. 'ఆస్మాన్'ను డిఫరెంట్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిస్తున్నారు. సస్పెన్స్‌కు కూడా కథలో ఉంటుందని టీమ్ మొదటి నుంచే చెబుతోంది. ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న లాంతరు, మోషన్ పోస్టర్‌లోని భారీ విజువల్స్ కూడా అదే మూడ్‌ను కొనసాగించాయి. అయితే మేఘాంశ్ పాత్ర ఏంటి, పురాణాలకు కథతో ఉన్న లింక్ ఏంటి అనే వివరాలను మాత్రం బయటపెట్టలేదు.

ఈ సినిమాతో రామ్ నందన్ తెలుగు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. రామ్ మైథాలజీ, ఫాంటసీ సినిమాల్లో తనదైన ముద్ర వేసిన కోడి రామకృష్ణ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశాడు. ఇప్పుడు అదే అనుభవంతో తెలుగు ప్రేక్షకులకు 'ఆస్మాన్' తీసుకొస్తున్నాడు. శ్రీ క్లిన్‌కారా సెల్యులోయిడ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మాతలు.ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తుండగా షోయబ్ అహ్మద్ కెమెరామెన్ గా వర్క్ చేస్తున్నారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, అరబిక్ భాషల్లోనూ సినిమాను తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇక 'ఆస్మాన్'తో మాత్రం మేఘాంశ్ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అందుకే ఫస్ట్ లుక్‌లోనూ గత సినిమాతో పోలిక లేకుండా కొత్త టోన్ ఎంచుకున్నారు. మరి అతని కెరీర్‌కు ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను ఇస్తుందో చూడాలి.



అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com